
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 2 ఆగస్టు 2024 | 5





7 వరకు తల్లిపాల వారోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ మహేష్‌కుమార్

వార్త..8లో

తొలిరోజు 97.27 శాతం

అమలాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్



పండుగలా సాగిన పెన్షన్ పంపిణీ

ఉదయం ఏడు నుంచే లబ్ధిదారుల ఇళ్లకు..

తొలిరోజే దాదాపుగా పూర్తి

అమలాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిరోజు 97.27 శాతం పెన్షన్లను పంపిణీ చేసినట్టు డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,42,200 మందికిగాను 2,35,596 మందికి రూ.98,07,77,000 పెన్షన్ సొమ్మును బట్వాడా చేసినట్లు చెప్పారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అమలాపురం పట్టణంలో పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్ యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేరూరు, అమలాపురం పట్టణంలో పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మంథా ఫణికుమార్, మొయిల శివ, వీరేష్‌కుమార్, జంగా అబ్బాయివెంకన్న, దెందుకూరి సత్తిబాబురాజు పాల్గొన్నారు.

ప్రతి నెలా ఒకటో తేదీన పండుగ రోజు

మంత్రి వాసంశెట్టి సుభాష్



పెన్షన్ పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూలై 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో ప్రతి నెలా ఒకటో తేదీని పేదలకు పండుగ రోజుగా మార్చిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని ఆరో వార్డులో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పింఛన్ల పెంపుతో ప్రతీ పేదవాడి ముఖంలో ఆనందం చూస్తున్నామన్నారు. వార్డులో ఇంటింటికి వెళ్లి మంత్రి సుభాష్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కడియాల రాఘవన్, జనసేన అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, మాజీ కౌన్సిలరు పంపన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల లంకలు



పి.గన్నవరం మండలంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో పడవలపై రాకపోకలు

నాటు పడవలపైనే రాకపోకలు

పి.గన్నవరం, ఆగస్టు 1: లంక గ్రామాలను వరద ముంపు ఇంకా వేధిస్తోంది. ఎగువన వరద తీవ్రత తగ్గినప్పటికీ దిగువన ధవళేశ్వరం వద్ద వరద నీరు నెమ్మదిగా తగ్గుతోంది. సముద్రంలోకి వచ్చే మిగులు జలాలు తగ్గినప్పటికీ నదీపాయలు మాత్రం ఇంకా నిండుగానే ప్రవహిస్తున్నాయి. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు గ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు లంక గ్రామాల ప్రజలు ఇంకా నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామాల రహదారులపై వరదనీరు తగ్గకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. శివాయిలంక మండల పరిషత్ ప్రాథమిక ఉపాధ్యాయుడు చిక్కం రవికుమార్ వరదను సైతం లెక్కచేయకుండా పడవలపై ప్రయాణం చేస్తూ పాఠశాల నిర్వహిస్తున్నారు. పాఠశాల నిర్మాణంలో ఉండటంతో పక్కనే ఉన్న కమ్యూనిటీ భవనంలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. వరద ముంపుతో భవనం సైతం నీట మునగడంతో రెండు రోజులు పాటు వేరే చోట పాఠాలు చెప్పారు.



వరద తగ్గినా కష్టాలు వీడలేదు

పడవలపైనే ఇంకా రాకపోకలు

నీటిలో కుళ్లుతున్న పంటలు

రహదారులపై ఇంకా నీరే

ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు



నేలకొరిగిన అరటి గెలలను ఆటోలో తరలిస్తున్న దృశ్యం

పూర్తిగా దెబ్బతిన్న పంటలు



పూర్తిస్థాయిలో దెబ్బతిన్న బొప్పాయి పంట

ఆలమూరు, ఆగస్టు 1: వరద నీరు తగ్గడంతో పంటలు చనిపోయి బురదతో దర్శనమిచ్చాయి. ఆలమూరు మండలం బడుగువానిలంక వాణిజ్య పంటలు పూర్తిగా నీట మునిగాయి. గత ఆదివారం గోదావరికి వరదనీరు వచ్చి పంటలు మునిగిపోవడంతో వరద నీటిలో పచ్చటి ఆకులతో కనిపించగా గురువారం అవన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. బొప్పాయి చెట్లు వరదనీరుకు పూర్తిగా చనిపోయి ఎండిపోతున్నాయి. ఇదే పరిస్థితి మిగిలిన పంటలకు ఉంది. వరదనీరు తగ్గిందనే ఆనందం కంటే ఎండుతున్న పంటలను చూసి రైతులు లబోదిబో మంటున్నారు.

ముంపులోనే కాజ్‌వే

పి.గన్నవరం, ఆగస్టు 1: పదిహేను రోజులుగా ఆ లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అప్పటి నుంచి గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంక గ్రామాల ప్రజలు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాద హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కనీసం నిబంధనలు పాటించకుండా రక్షణ బృందాలను ఏర్పాటు చేయలేదు. వారి నిర్లక్ష్యం వలన ఈనెల 28న పడవ ప్రమాదం జరిగి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో నిబంధనలను గుర్తు చేస్తూ నదీపాయల వద్ద పూర్తిస్థాయిలో రక్షణ ఏర్పాటు చేయాలని ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడ్డాయి. స్పందించిన అధికారులు బూరుగులంక రేవులో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేసి లంక గ్రామస్తుల రాకపోకల సమయంలో పడవపై ఉండేటట్లు చర్యలు తీసుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు పడవ దాటే వారికి లైఫ్ జాకెట్లపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు, విద్యార్థులకు రక్షణగా సేవలు అందిస్తున్నారు.



మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వేపై వరదనీరు



పి.గన్నవరం: మానేపల్లి శివాయిలంకకు వరద నీటిలో వెళ్తున్న ఉపాధ్యాయుడు

బయటపడుతున్న నష్టాలు

మామిడికుదురు, ఆగస్టు 1: లంక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టడంతో నష్టాలు బయట పడుతున్నాయి. లంక గ్రామాల్లోని రైతులు పండించే అరటి చెట్లు నేలకొరగడంతో చెట్లకు ఉన్న గెలలను తొలగించి వాటిని సొమ్ము చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. బి.దొడ్డవరం, అప్పనపల్లి, పెదపట్నంలంక, పెదపట్నం తదితర గ్రామాల్లోని కాయగూరపాదులు ఎందుకూ పనికిరావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద వల్ల తమకు అపార నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వేపై ఇంకా మూడు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు జరగడం లేదు. దీంతో లంక గ్రామాల ప్రజలు అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా మామిడికుదురు చేరుకుంటున్నారు. వరద ప్రభావంతో లంక గ్రామాల్లోని పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. ఉచ్చులవారిపేట నుంచి అప్పనపల్లి వెళ్లడానికి వేసిన సిమెంటు రోడ్డు బెర్మ్‌లు కొట్టుకుపోయి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. వరద తగ్గడంతో ఒక్కొక్క నష్టం బయట పడుతుందని లంక గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

నిబంధనల మేరకు కొబ్బరి కొనుగోళ్లు

అంబాజీపేట, ఆగస్టు 1: అంబాజీపేట మార్కెట్ యార్డు ఏర్పాటు చేసిన నాఫెడ్ కొనుగోలు కేంద్రంలో నిబంధనల మేరకు కొబ్బరిని కొనుగోలు చేయనున్నట్లు ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు చెప్పారు. అంబాజీపేటలో కొబ్బరి కొనుగోళ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లాలో ఆరబోసిన కొబ్బరిని సుధాకరరావు, కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఛైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ పరిశీలించారు. రైతులు కొబ్బరి తోటల సామర్థ్యాన్ని బట్టి రైతుకు ఎకరానికి రెండు బస్తాలు నెలకు విక్రయించుకోవాలన్నారు. రైతు ఎన్ని ఎకరాలు ఉన్న ఒకే సారి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సుధాకరరావు సూచించారు. కొబ్బరి విక్రయించిన 15 రోజుల్లో రైతుల ఖాతాకు సొమ్మును జమ చేయనున్నట్లు చెప్పారు.

డొక్కా సీతమ్మ సేవలు చిరస్మరణీయం

7లో

సీతమ్మ నివాసాన్ని సందర్శించిన నేతలు

అన్నవరంలో దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

7లో

పురోహితులు, నాయీ బ్రాహ్మణుల పేర్లతో బోర్డులు

సుప్రీం తీర్పుపై సంబరాలు

అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో సంబరాలు



వర్గీకరణ పోరాటం విజయ తీరాలకు చేరిందని నేతల హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు గురువారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. కోనసీమ దండోరా మాజీ అధ్యక్షుడు గంపల సత్యప్రసాద్ మాదిగ, ఆకుమర్తి ఆశీర్వాదం, దూరి రాజేష్, కొల్లి సూర్యారావు, గంపల దుర్గాప్రసాద్, మిరియాల అశోక్ తదితరుల ఆధ్వర్యంలో తొలుత బుద్ధవిహార్ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను చేతబూని సినిమారోడ్డు మీదుగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందని వక్తలు పేర్కొన్నారు. మోదీ, కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లవరపు సత్తిబాబు, గంపల గోవిందు, ఆకుమర్తి రమేష్, గంపల శివమణి, ఆకుమర్తి బేబిరాణి, ఆకుమర్తి కోకిల, మంద గెద్దయ్య, మల్లవరపు రాజు పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్వీ నాయుడు తదితరులు సంబరాల్లో పాల్గొన్నారు.


సుప్రీంకోర్టు న్యాయం చేసింది

ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు

అమలాపురం రూరల్, ఆగస్టు 1: ఎస్సీ రిజర్వేషన్ల అమలులో అన్యాయానికి గురవుతున్న మాదిగ అనుబంధ కులాలకు ఇన్నాళ్లకు సుప్రీంకోర్టు న్యాయం చేసిందని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు సమర్థించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. నడిపూడి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో మందకృష్ణమాదిగ, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. వెల్ఫేర్ సొసైటీ నాయకులు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, మంద వెంకటేశ్వరరావు, నూటికుర్తి మూర్తి, కొడమంచిలి కృష్ణ, చేట్ల సత్యనారాయణ, మోకాటి అమ్మిరాజు, ఈతకోట రాజు, కాప శివ, చేట్ల వరప్రసాద్ పాల్గొన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు జరుపుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. కామనగరువులో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు అధ్యక్షతన సమావేశంలో మంద కృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, తొత్తరమూడి మహేశ్వరరావు, చేట్ల విద్యాసాగర్, ఆకుమర్తి సత్యనారాయణ, నవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడిలో ఎన్నికల గంట

ఎస్ఎంసీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల



అమలాపురం జడ్పీ పాఠశాలలో షెడ్యూల్ విడుదల చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్, ఆగస్టు 1: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు సమగ్ర శిక్షా ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం జిల్లాలోని 1578 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాతో పాటు షెడ్యూల్‌ను ఆయా పాఠశాలల హెచ్ఎంలు విడుదల చేశారు. తల్లికి వందనం, విద్యా కానుకలతో పాటు ప్రభుత్వ పరంగా జరిగే అభివృద్ధి పనులను ఎస్ఎంసీ కమిటీ పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించకుండా సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది. గురువారం ఓటర్ల జాబితా ప్రకటించిన అనంతరం మధ్యాహ్నం 1 గంట వరకు అభ్యంతరాలను స్వీకరించారు. సాయంత్రానికి వాటిని పరిష్కరించి తుది జాబితాను విడుదల చేశారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

జీవీవీ సత్యనారాయణ, సీఎంవో, సమగ్రశిక్షా

ఎస్ఎంసీ ఎన్నికలను ఈ నెల 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తాం. ఎన్నికల సమయంలో తరగతి గదిలో 50 శాతం మంది తల్లిదండ్రులు, సంరక్షకులు విధిగా హాజరు కావాల్సి ఉంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. 3 గంటల నుంచి 4 గంటల వరకు తొలి ఎస్ఎంసీ సమావేశం నిర్వహిస్తారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా పాఠశాల హెచ్ఎం వ్యవహరిస్తారు.

భూగర్భ గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా

ఆకస్మిక తనిఖీలు



ఇసుక యార్డు పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్‌మీనా

ఇసుక యార్డు, లిక్కరు డిపోల పరిశీలన

ఇసుక యార్డులో వచ్చిన ఫిర్యాదులపై మీనా విచారణ

మద్యం విక్రయాలపై ఆరా

పర్యటనలో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్


అమలాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి)/ రావులపాలెం: ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ భూగర్భ గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. గనులు, భూగర్భశాఖకు చెందిన ఇసుక స్టాక్ పాయింట్లతో పాటు లిక్కరు డిపోలను తనిఖీలు చేశారు. ప్రత్యేక కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా వెంట జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో పాటు ఎక్సైజ్, గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. తొలుత కోనసీమ ముఖ ద్వారమైన రావులపాడులోని ఇసుక స్టాకు యార్డును సందర్శించారు. ఇటీవల ఆన్‌లైన్ టోల్‌ఫ్రీ నంబరు ద్వారా అందిన ఫిర్యాదులపై స్టాకు యార్డు వద్ద సిబ్బంది, లారీ డ్రైవర్లు, వినియోగదారులను విచారించారు. ఒక ఆధార్ కార్డుపై 20 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేయాలని, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-పాస్ మిషన్ చెల్లింపులు, రోజువారీ విక్రయాలు వంటి రికార్డులను మీనా పరిశీలించారు. ఇసుక సరఫరాకు సంబంధించి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అంశంపై ఆరా తీశారు. వినియోగదారులు అక్కడి ఇసుకను ఏయే భవనాలకు వినియోగిస్తున్నారు, ఇతర అవసరాలకు వాడుతున్నారా అనే అంశంపై కూడా స్థానికులను ప్రశ్నించారు. స్టాకు యార్డు నిర్వహణకు సంబంధించి ఎంత మంది ఉద్యోగాలు చేస్తున్నదీ తెలుసుకున్నారు. వినియోగదారులకు ఉచిత ఇసుకను పరిపాలనా పరమైన ఖర్చులను మాత్రమే వసూలుచేసి ఇసుకను విక్రయిస్తున్నామని, రవాణా చార్జీలు నిబంధనల మేరకు చెల్లింపులు జరిగేలా పర్యవేక్షణ ఉండాలని ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 6 స్టాక్ యార్డులు ఉండగా ఆలమూరు మండలం జొన్నాడ స్టాక్ యార్డు వరద ముంపు బారిన పడిందన్నారు. రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్నట్లు ప్రజల్లోకి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఉచిత ఇసుక సరఫరాకు సంబంధించి పరిపాలనా పరమైన ఖర్చుల వివరాలను బోర్డుల రూపంలో ప్రదర్శించామని, అన్ని ఇసుక యార్డుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. కోనసీమ జిల్లాలో ఆరు ఇసుక యార్డులు ఉండగా వరద కారణంగా జొన్నాడ యార్డు మునిగిపోయిందని తెలిపారు. రవాణా చార్జీలు తెలిపే బోర్డులను కూడా ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రావులపాడు యార్డులో ఇసుక తనిఖీ సమయంలో ఆర్డీవో సత్యనారాయణ, గనులశాఖ అధికారి సాయిరామ్‌సింగ్, సహాయక అధికారి జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయాలు పారదర్శకంగా ఉండాలి

మద్యం, లిక్కరు విక్రయాలు పారదర్శకంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ప్రత్యేక కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. అమలాపురంలోని ఐఎంఎల్ లిక్కర్ డిపోను ఆకస్మికంగా పరిశీలించారు. గోడౌన్‌కు ఏయే బ్రాండ్ల లిక్కరు సరఫరా అవుతుంది, జిల్లాలో షాపులకు ఎలా సరఫరా చేస్తున్నారు అని ఆరా తీశారు. మద్యం గోడౌన్‌లో నిల్వ చేసిన వివిధ బ్రాండ్‌ల లిక్కర్‌ను పరిశీలించారు. ఎక్సైజ్ అధికారులను జిల్లా వారీగా మద్యం విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆర్.మహేష్‌కుమార్, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి అజయ్‌కుమార్‌సింగ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ఎరుపెక్కింది..సాగరం

అల్లవరం, ఆగస్టు 1: ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు వైనతేయ గోదావరి నదికి వరద నీరు పోటెత్తి సముద్రపు నీరు ఎరుపెక్కింది. నీలిరంగులో ఉండే సముద్రపు నీరు ఎరుపు రంగులోకి మారడంతో పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం సముద్ర తీరానికి సందర్శకులు తరలివచ్చారు. ఇలా కొద్ది రోజుల పాటు ఉండి తిరిగి సాధారణ రంగులోకి నీరు మారుతుందని స్థానికులు చెబుతున్నారు.ప్రవాహం సాధారణంగానే ఉందని వారు తెలిపారు.



అమ్మపాలు అమృతం



తల్లిపాల వారోత్సవాల సందర్భంగా...

అంబాజీపేట, ఆగస్టు 1: అమ్మ పాలు అమృతంతో సమానం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, వజ్ర సమానమైన రోగ నిరోధక శక్తి పొందాలంటే తల్లి పాలు పట్టించాల్సిందే. తల్లి పాలను పుట్టిన బిడ్డకు పడితే ఇద్దరికీ ఎన్నో లాభాలున్నాయి. ఎన్నో రకాల వ్యాధులు దరిచేరవు. ఇంతటి విశిష్టత కలిగిన తల్లిపాలను బిడ్డ ఎంత వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి .. రోజుకు ఎన్నిసార్లు పట్టాలి.. ఎలా పట్టాలి.... తల్లిపాలు పుష్కలంగా రావాలంటే ఏం తినాలి.. ముర్రు పాలు ఎప్పుడు పట్టాలి... ఇలా చాలా అంశాలపై అందరికీ అవగాహన ఉండదు. ఆధునిక కాలం అమ్మలకు ఈ విషయాలపై అవగాహన మరీ తక్కువ. ఇలాంటి అంశాలకు వారికి తెలియజేస్తూ తల్లిపాలు ప్రాముఖ్యతను చాటేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లి పాలు వారోత్సవాలను గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో నాలుగు రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఆరోగ్య శాఖ అనుబంధంతో ఈ కార్యక్రమాలను చేపట్టారు.

ముర్రుపాలు తప్పనిసరి ఎందుకంటే...

- బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే పాలనే ముర్రుపాలు అంటారు.
- శిశువుకు ఇవి కచ్చితంగా పట్టాలి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా బిడ్డకు సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయి. ఇందులో మాంసకృత్తులు, విటమిన్-ఎ ఉంటాయి.
- వ్యాధులు రాకుండా బిడ్డను జీవిత కాలం కాపాడతాయి.
- శిశువు ప్రేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- తల్లులు సహజంగా బిడ్డకు సరిపడా పాలు రావట్లేదని అనుకోవడం అపోహ మాత్రమే.
- బిడ్డ పుట్టగానే పాలు మూడు, నాలుగు రోజుల వరకు తేనె నాకించడం, పంచదార నీళ్ల ఇవ్వడం, గ్లూకోజ్ నీళ్ల ఇవ్వడం చేయకూడదు.
- ఆరు నెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా రోజుకు ఎనిమిది నుంచి పదిసార్లు పాలు ఇవ్వాలి.

తల్లిపాలు పుష్కలంగా రావాలంటే..

- గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి. పాలు, చేపలు, గుడ్లు, వెల్లుల్లిపాయ, తాజా కూరగాయలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి. ఆహారంలో తీపి పదార్థాలు (స్వీటు కాదు) అంటే సహజంగా దొరికే పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాత తినాలి.

తల్లికి బోలెడు లాభాలు

- చనుబాలు ఇవ్వడం వల్ల గర్భధారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు తల్లులు త్వరగా కోలుకుంటారు. జీవితాంతం ఆరోగ్యం ఉంటారు. చనుబాలు ఇచ్చినందువల్ల ఊబకాయం వచ్చ ప్రమాదం తగ్గుతుంది. గర్భానికి పూర్వం ఉన్న బరువును తిరిగి పొందగలుగుతారు.

బిడ్డకు లాభాలావీ...

- తల్లిపాలు శిశువుకు సంపూర్ణమైన సంతులిత ఆహారాన్ని అందిస్తాయి.
- నాణ్యమైన ప్రోటీన్లు అంది మెదడు వికసిస్తుంది.
- ఈ పాలలో బిడ్డలకు అవసరమయ్యే విటమిన్లు పుష్కలంగా ఉంటాయి.
- ఇందులోని లాక్టోజ్ వల్ల కాల్షియం నిల్వలు పెరుగుతాయి. బిడ్డను రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- తొలి నెలలో శిశువులను వివిధ రకాల అంటువ్యాధుల బారి నుంచి కాపాడుతాయి.
- బిడ్డ మనోవికాసానికి తోడ్పడతాయి. బిడ్డ మృదువైన మలవిసర్జనకు, మలబద్ధకం సమస్య నివారణకు తోడ్పడతాయి. జీర్ణ మండలాన్ని వృద్ధి చేస్తాయి.
- తల్లి పాల ద్వారా బిడ్డలను డయేరియా, న్యుమోనియా వంటి ప్రాణాంతకు వ్యాధుల నుంచి కాపాడవచ్చు. క్యాన్సర్, చెవికి సంబంధించిన వ్యాధులు, గుండె జబ్బుల నుంచి కూడా రక్షణ కల్పిస్తాయి.
- ఎలర్జీ, ఆస్తమా, డయాబెటిస్ వంటి వ్యాధులు రావు.
- బాల్యంలో, యవ్వనంలో ఊబకాయం వచ్చే ప్రమాదం తక్కువ.

తల్లిపాల దినోత్సవం ఇలా మొదలైంది...

ఇటలీ దేశంలోని ఫ్లోరెన్స్ నగరంలో ఇన్నోసెంటి సెంటర్లో 1990 జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు అంతర్జాతీయ సమావేశం జరిగింది. తల్లిపాల విశిష్టతను గుర్తించి ఏటా ఆగస్టు 1 నుంచి వారం పాటు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నారు. తల్లిపాలపై తల్లుల్లో ఉన్న అపోహలను తొలగించి, తల్లిపాల గొప్పతనం చాటి చెప్పడం వీటి ప్రధానోద్దేశం.

తల్లిపాలు శిశువుకు ఎంతో మేలు

పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలను ఆరు నెలల వరకు కచ్చితంగా ఇవ్వాలి. తల్లి నుంచి మొట్టమొదట వచ్చే పాలను పిల్లలకు ఇవ్వకూడదనే అపోహ ఉంది. కానీ అది సరైనది కాదు. మొదట మూడు రోజుల పాటు వచ్చే పాలలో (ముర్రుపాలు) కొలస్ట్రం ఉంటుంది. ఇది బిడ్డ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం. కొలస్ట్రంలో ప్రొటీన్ పాళ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బిడ్డకు రోగ నిరోధక శక్తినిస్తాయి. తల్లి నుంచి బిడ్డకు ఇమ్యూనోగోలబ్యులిన్స్ పాల ద్వారా బిడ్డకు చేరుతాయి. దీని పాజిటివ్ ఇమ్యూనిటీ అంటాం. దీంతో బిడ్డకు అంటువ్యాధులు రావు. మొదటి మూడు రోజులు కొలస్ట్రంతో కూడిన పాలు తాగని పిల్లలు విలువైన వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారు. తల్లిపాల ద్వారా ఎలాంటి వ్యాధులూ దరిచేరవు.



అంబాజీపేట మండలం తొండ వరంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తల్లి పాల శ్రేష్ఠతపై అవగాహన కల్పిస్తున్నారు. 46 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అప్పర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎంహెచ్‌వో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



డొక్కా సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబు

డొక్కా సీతమ్మ సేవలు

భావితరాలకు గుర్తుండిపోతాయి

సీతమ్మ నివాసాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, కూటమి నాయకులు

పి.గన్నవరం, ఆగస్టు 1: అపర అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన డొక్కా సీతమ్మ సేవలు భావితరాలకు గుర్తుండిపోయేలా కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. రాబోయే తరాలకు ఆదర్శంగా ఉండేలా విద్యా శాఖలో పథకాలకు డొక్కా సీతమ్మ, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం పేర్లు నిర్ణయిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గురువారం లంకల గన్నవరంలోని సీతమ్మ నివాసంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబుతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీసుకునే నిర్ణయాలు చారిత్రాత్మకంగా ఉంటాయన్నారు. సీతమ్మ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. పి.గన్నవరం పాత అక్విడెక్టును పర్యాటక కేంద్రంగా మార్చే అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉంచామని.... సీతమ్మ నివాసాన్ని కూడా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరతామన్నారు. నామన రాంబాబు మాట్లాడుతూ 2020లో బీజేపీతో భాగస్వామిగా ఉన్న సమయంలో పి.గన్నవరం అక్విడెక్టుకు డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. డొక్కా నాద్‌బాబు మాట్లాడుతూ 2019 ఎన్నికలతో పాటు ఈ ఎన్నికల్లో కూడా ప్రతి బహిరంగ సభలోనూ డొక్కా సీతమ్మ పేరును పవన్‌కల్యాణ్ ప్రస్తావించారని గుర్తు చేశారు. తొలుత సీతమ్మ నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతమ్మ ఐదో తరం వారసుడు డొక్కా వెంకటభీమకామేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నామన రాంబాబులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, తొలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, అవనిగడ్డ సత్తిబాబు, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, డొక్కా ప్రభాకరమూర్తి, శేరు శ్రీనుబాబు, త్సల్లా బిందుమాధవరావు, యర్రంశెట్టి తాత, గనిశెట్టి ఈశ్వర్, లంకే చిరంజీవి, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, బోరుసు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతమ్మ ఐదో తరం వారసుడు భీమవెంకట కామేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నేతలు

దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలి

ఎమ్మెల్సీ ఐవీ రావు

అమలాపురం టౌన్, ఆగస్టు 1: దాళ్వా పంట సొమ్ములు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) డిమాండు చేశారు. ఇదే అంశాన్ని శాసనమండలి సమావేశాల్లో చర్చించామన్నారు. కోనసీమ జిల్లాకు రూ.154.63 కోట్లు, పశ్చిమ గోదావరికి రూ.424.55 కోట్లు, కాకినాడకు రూ.9.49 కోట్లు,తూర్పుగోదావరి, బాపట్ల జిల్లాలతో కలిపి మొత్తం రూ.647 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారన్నారు రైతులు సార్వా పంటకు సిద్ధమయ్యే తరుణంలో సొమ్ములు చాలా అవసరమని, బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరారు. ఒక్క అమలాపురం రూరల్ మండలంలోనే 435 మంది రైతులకు రూ.5.63 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.

ప్రజా నాయకులకు మరణం లేదు

నల్లమిల్లి మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు

అనపర్తి, ఆగస్టు 1: ప్రజల మనస్సుల్లో గూడు కట్టుకున్న నాయకులకు మరణం లేదని వారు ఎల్లప్పుడూ ప్రజల హృదయాల్లో జీవిస్తూనే ఉంటారని పలువురు నాయకులు పేర్కొన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా జరిగిన పలు కార్యక్రమాల్లో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కార్మిక శాఖ వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనపర్తి మండలం రామవరంలో నల్లమిల్లి నివాసంలో స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. మూలారెడ్డి చిత్రపటానికి, గ్రామంలోని విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పథకంలో పింఛన్లను పంపిణీ చేశారు. స్పీకర్ మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ప్రభుత్వం ఏర్పడితే ప్రజల మోములో చిరునవ్వు వికసిస్తూనే ఉంటుందన్నారు. పెంచిన పింఛను రెండో నెలలో పంపిణీ చేయలేరని వైసీపీ నాయకులకు కనువిప్పు కావాలని దిగ్విజయంగా గంటల వ్యవధిలోనే సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వం సత్తా చూపుతుందన్నారు. మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రజలకు కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పయనిస్తోందని, హామీలు వంద శాతం పూర్తి చేయగల సత్తా చంద్రబాబుకు ఉందన్నారు.

బిక్కవోలు మండలం పందలపాకలో ఏర్పాటు చేసిన నల్లమిల్లి మూలారెడ్డి విగ్రహాన్ని స్పీకర్ అయ్యన్న, మంత్రి ఆనం, ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు.



రామవరంలో మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం అన్నవరం - ఆంధ్రప్రదేశ్ - 533 406

శ్రీ స్వామి వారి దేవస్థానంలో వివాహము చేయు పురోహితులు

వివాహాలు చేయించే పురోహితుల పేర్లు, సెల్ నెంబర్లతో ఏర్పాటు చేసిన బోర్డు

అన్నవరం దేవస్థానంలో
వివాహ దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

వివాహాలు చేయించే పురోహితులు, నాయీ బ్రాహ్మణుల పేర్లతో బోర్డులు

అన్నవరం, ఆగస్టు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో కొన్ని దశాబ్దాలుగా వేళ్లూనుకు పోయిన వివాహ దళారీ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వివాహాల పేరుతో దళారులు భక్తుల నుంచి వేలాది రూపాయలు దోచేస్తున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో అన్నవరం దేవస్థానంలో వివాహాలు చేయించే 57 మంది పురోహితులు, 33 మంది సన్నాయి, భజంత్రీలు వాయించే నాయీబ్రాహ్మణుల పేర్లు, వారి ఫోను నంబర్లను వివాహాలు జరిగే ప్రదేశాల్లో బోర్డులు రూపంలో ఏర్పాటుచేశారు. వీటిని సీఆర్వో, పీఆర్వో, శివసదన్, హరిహర సదన్ కాటేజీల వద్ద పెడుతున్నట్టు అధికారులు వెల్లడించారు. వివాహ బృందాలు దళారుల ప్రమేయం లేకుండా వారితో నేరుగా మాట్లాడుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ధరలను కూడా దేవస్థానం నిర్ణయిస్తే బాగుంటుందని వివాహ బృందాలు పేర్కొంటున్నాయి.



వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న అయ్యన్నపాత్రుడు

తంటికొండ వెంకటేశ్వరస్వామికి
స్పీకర్ ప్రత్యేక పూజలు

గోకవరం, ఆగస్టు 1: తంటికొండ వేంకటేశ్వరస్వామిని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవస్థానం అధికారులు స్వామి ప్రసాదం అందించారు. టీడీపీ నాయకులు మంగరౌతు రాము, జనపరెడ్డి సుబ్బారావు, పాలూరి బోస్, ఎస్వీఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్నదొర, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, పోసిన ప్రసాద్, బదిరెడ్డి అచ్చన్నదొర, గెడ్డం బాబు, పెద్దాడ వెంకన్నదొర, మలిరెడ్డి సిరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వాగు నీటిలో పడి వ్యక్తి మృతి

చింతూరు, ఆగస్టు 1: వరద ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం ఉలుమూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం... పూసం రాజయ్య (60) గేదెలకోసమని ఇంటి నుంచి శబరి ఒడ్డుకు గురువారం ఉదయాన్నే బయల్దేరాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో రాజయ్య కుటుంబీకులతో పాటు గ్రామస్తులు మధ్యాహ్న సమయంలో పరిసర ప్రాంతాల్లో వెతికారు. గ్రామ సమీపంలోని వాగు నీటిలో కూడా గాలించారు. చివరకు వాగు నీటిలో మృతదేహం బయటపడింది. శబరి ఒడ్డుకు వెళ్లే క్రమంలో వాగు దాటబోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. రాజయ్య మృతదేహాన్ని అతడి ఇంటికి తరలించారు. జరిగిన ఘటనపై రెవెన్యూ పోలీసు అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు.





రాజయ్య మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న గ్రామస్తులు, రాజయ్య (ఇన్‌సెట్‌లో)

గొల్లపాలెంలో గంజాయి బ్యాచ్ అరెస్టు

మలికిపురం, ఆగస్టు 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపాలెంలో గంజాయి తాగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది యువకుల్లో ఒకరు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. నిందితుల్లో ఒకరిని మైనరుగా గుర్తించారు. కేసు నమోదుచేసి నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ చెప్పారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, ఆగస్టు 1: మరిడమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆరువేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాలు తెలియజేశారు.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఉపాధ్యాయ నియోజకవర్గాల
ఓటర్ల జాబితా రూపకల్పన

- ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు అవకాశం
- దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు తేదీ సెప్టెంబరు 3

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1: ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితా రూపకల్పనకు ఫారం-19 దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత నెల 29న ఈ ప్రక్రియ ఆరంభమైంది. ఓటర్లుగా నమోదుకు ఉపాధ్యాయులు సెప్టెంబరు 3 వరకు తమ దరఖాస్తులను అధికారులకు అందజేయాల్సి ఉంది. ఏపీ శాసనమండలిలో ఉన్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రూపొందిస్తున్నారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఈవోఆంధ్ర.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫారం-19లో వివరాలు నింపాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో పాటు ప్రిన్సిపాళ్ల ధ్రువీకరించిన దరఖాస్తు సమర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రిన్సిపాళ్లతో పాటు డీఈవో గానీ, ఆర్ఐవో గానీ, ఆర్‌జేడీగానీ తప్పనిసరిగా కౌంటర్ సంతకం చేయాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వివరాలు సమర్పించాలన్నారు. వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.



మెసేజ్ ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలో నగదు మాయం

లబోదిబోమన్న మహిళ పోలీసులకు ఫిర్యాదు... సైబర్ నేరంపై కేసు నమోదు

అంబాజీపేట, ఆగస్టు 1: ఓ మహిళ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు పంపించిన మెసేజ్ ఓపెన్ చేయడంతో ఆమె ఖాతాల్లో ఉన్న రూ.2.20 లక్షలు మాయమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లికి చెందిన వేదుల కిరణకుమారి మొబైల్‌కు గత నెల 16వ తేదీన తెలియని మెసేజ్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగా 18న ఆధార్‌తో కూడిన ఓటీపీలు వచ్చాయి. అదేరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె ఖాతాలో ఉన్న నగదు దశల వారీగా కట్ అయ్యాయి. వెంటనే ఆమె పుల్లేటికుర్రులోని యూనియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులకు సమాచారం ఇచ్చింది. ఆమె ఖాతా నుంచి మూడు దఫాలుగా రూ.1.50 లక్షలు రూ.50వేలు, రూ.20,500 గుర్తు తెలియని వ్యక్తికి బదిలీ అయినట్టు తెలిపారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. సైబర్ నేరంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

పులి పాద ముద్రలపై పోలీసుల ఆరా

అమలాపురం రూరల్, ఆగస్టు 1: సవరప్పాలెంలో పులి పాద ముద్రలు ఉన్నాయంటూ బుధవారం విస్తృతంగా ప్రచారం జరగడంతో పోలీసులు అటవీశాఖ అధికారులు గురువారం రంగ ప్రవేశం చేశారు. పులి సంచరించిందన్న ప్రాంతంలో వర్షం కురవడంతో ఏవిధమైన ఆనవాళ్లు అక్కడ కనిపించలేదని తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఎవరికైనా ఎక్కడైనా మళ్లీ ఆటువంటి ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

● ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



కె.గంగవరం: యర్రపోతవరంలో పింఛను అందజేస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఆగస్టు1: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో నిర్వహించడం ఆనందంగా ఉందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం యర్రపోతవరం గ్రామంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కాకినాడ రామారావు, ఆర్టీసీ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ పాణింగపల్లిలో పింఛన్లు పంపిణీ చేశారు. యండగండిలో పార్టీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, పామర్రులో మరివాడ సూరిబాబు, కోటిపల్లిలో రేవు శ్రీను, కుందూరులో జగతా రమణ పింఛన్లు పంపిణీలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, కొత్తపల్లి మొరార్జీ, సాపిరెడ్డి విశ్వనాథబాలాజీ, రాయపురెడ్డి బాబు, తమ్మా చిన్న, పెమ్మాడి సత్తిబాబు, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ముమ్మిడివరం: ఎన్టీఆర్ పింఛన్ల భరోసా పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన పార్టీల నాయకుల ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. మండలంలో 6,983 పింఛన్లకు 6,763 పింఛన్లు పంపిణీచేసి 96.85 శాతం పూర్తి చేశారు. నగర పంచాయతీ పరిధిలో 3082 పింఛన్లకు 3026 పంపిణీచేసి 98.18 శాతం సాధించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు నగర పంచాయతీ 8వ వార్డు సూరాయిచెరువులో దివ్యాంగురాలు దొండపాటి దుర్గమ్మకు రూ.15వేలు పింఛను అందించి పంపిణీని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, కురసాల శివబాబు కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, చెల్లి అశోక్, దాట్ల బాబు, కట్టా సత్తిబాబు, కడలి సౌజన్య, డి.ఏడుకొండలు, పితాని రాము, జాగు రాంబాబు, పెన్మెత్స సుబ్బరాజు, మిమ్మితి చిరంజీవి, ఈవోపీఆర్డీ కె.లక్ష్మీకల్యాణి పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం మురమళ్లలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తుల సాయి, జంపన బాబు, ఏలూరి మూర్తి, చెయ్యేటి శ్రీనుబాబు, గంజా సుధాకర్, రాయపురెడ్డి మాణిక్యం, శ్రీను పాల్గొన్నారు.

అన్నమాట నిలబెట్టుకున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే దేవ

మలికిపురం: కూటమి పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేసుకుంటూ పోతున్నామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శంకరగుప్తంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వడ్ల దుర్గారత్నకుమార్‌కు రూ.15వేలు, దివ్యాంగుడైన నాగమణి, ఝాన్సీలకు రూ.6వేలు వంతున పింఛన్లు అందజేశారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ముదునూరి చినబాబు, గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ రాపాక ఆనంద్‌కుమార్, గెడ్డం మహలక్ష్మీకుమార్, తాడి మోహన్, మాణిక్యం పాల్గొన్నారు.

అంతర్వేది: కూటమి ప్రభుత్వం రాగానే హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం అంతఃకరణశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం గ్రామాల్లో పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని దివ్యాంగులు, వృద్ధులకు అందజేశారు. అలాగే ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పలు పెన్షన్ల పంపిణీలో పాల్గొని దివ్యాంగులు, వృద్ధులకు పెన్షన్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఏపీఎం కె.విజయ్, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, కౌరు శ్రీను, బీజేపీ నాయకుడు మాలే శ్రీనివాస నగేష్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తెల్లవారక ముందే లబ్ధిదారులకు పింఛన్లు

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వంలో ఒకవైపు తెల్లవారక ముందే లబ్ధిదారులు ఇంటికి పింఛను అందిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం మండలంలోని ఉడిమూడి, లంకలగన్నవరం, యర్రంశెట్టివారిపాలెంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు పి.గన్నవరంలోను, రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాద్‌బాబు లంకలగన్నవరంలోను పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, సర్పంచ్‌లు ఎస్.ప్రసన్నకుమార్, పసలపూడి రామకృష్ణ, యర్రంశెట్టి త్రివేణి, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, అవనిగడ్డ సత్తిబాబు, గోపి పాల్గొన్నారు.

వరద ముంపులోనే పింఛన్ల పంపిణీ

పలు లంకగ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ముంపును సైతం లెక్కచెయ్యకుండా నూరుశాతం పింఛన్లు పంపిణీ లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం సాయంతో ఆసుపత్రికి తీసుకువెళ్లిన ఉడిమూడిలంక గ్రామానికి చెందిన కుసుమే జేమ్స్‌కు ఆసుపత్రిలో వీఆర్వో దుర్గాప్రసాద్ పింఛన్‌ను అందించారు. పి.గన్నవరం మండలంలో 10,178 పింఛన్లకుగాను రూ.4.27 కోట్లు అందించే లక్ష్యం కాగా, సాయంత్రానికి 97శాతం పూర్తయినట్లు ఎంపీడీవో తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అయినవిల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. విలస గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కుప్పాల ఈశ్వరి-రాంబాబు, గంధం రమేష్, అక్కిశెట్టి దుర్గారావు, సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్, పెండ్ర రమేష్ పాల్గొన్నారు.

అంబాజీపేట: కూటమి ప్రభుత్వంలో ప్రతిఇంటికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లో పింఛన్లను ఎమ్మెల్యే లబ్దిదారులకు అందించారు. మండలంలో 9,148 పింఛన్లు ఉండగా 98.06 శాతం పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు.

మామిడికుదురు: గురువారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మొగలికుదురు, పాశర్లపూడిలో పెన్షన్లను పంపిణీ చేశారు. నగరంలో అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పెన్షన్లను పంపిణీని పరిశీలించారు. మగటపల్లిలో జడ్పీ మాజీచైర్మన్ నామన రాంబాబు పెన్షన్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజు, పార్టీ నాయకులు తుండూరి బుజ్జి, మందా గాంధీ, చుట్టుగుళ్ల కిశోర్, కోళ్ల సురేష్‌బాబు, పార్వతి పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపింది చంద్రబాబే: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు పింఛన్లు పెంపుదలచేసి నేరుగా లబ్ధిదారులకు ఇంటికి పింఛన్లు పంపిణీ చేయడంద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. గురువారం మండపేట పట్టణంలో ఎమ్మెల్యే వేగుళ్ల పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, కోన సత్యనారాయణ, వాదా ప్రసాదరావు, బండి గోవిందు, జోన్నపల్లి సూర్యారావు, పెద్దపాటి సత్తిబాబు, షేక్ ఇబ్రహీం, శిరీష్, గుత్తుల సత్తిబాబు పాల్గొన్నారు.

దివ్యాంగునికి సత్వర న్యాయం అందించిన ఎమ్మెల్యే బండారు

ఆలమూరు: పూర్తి దివ్యాంగునిగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ దివ్యాంగ పూర్తి పింఛన్ రాక ఇబ్బందులు పడుతున్న ఆలమూరు మండలం సంధిపూడికి చెందిన దివ్యాంగ బాలుడు నల్లా పవన్‌శ్రీమణికంఠకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్వర న్యాయం అందించారు. మణికంఠకు గత నెలలో రూ.6వేల పింఛన్ రాగా పూర్తి దివ్యాంగుడైన విషయాన్ని ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో మణికంఠకు రూ.15 వేల పింఛన్ మంజూరైంది. ఈ పింఛన్‌ను ఎమ్మెల్యే బండారు చేతులమీదుగా అందించారు. ఆలమూరు మండలంలోని జొన్నాడ, ఆలమూరు, గుమ్మిలేరు గ్రామాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలంలో మండల పరిధి లోని పలుగ్రామాల్లో ఎమ్మెల్యే సత్యానందరావు మండల, గ్రామపార్టీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. మండల నాయకులు, గ్రామ నాయకులు, బూత్ కన్వీనర్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తపేట: లబ్ధిదారులకు గురువారం మండల పరిధి వాడపాలెం, కొత్తపేట పెదగూళ్లపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 6 గంటలకు స్వయంగా ఆయన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి భాస్కరరావు, త్సామా బాబు, కంఠంశెట్టి శ్రీను, దర్నాల రామకృష్ణ, బండారు బుల్లితాత, వాసంశెట్టి సత్యనారాయణ, యల్లమిల్లి జగన్మోహన్, చీకట్ల అబ్బు, కట్టా శ్రీను, బీరా ఇసాక్, బూసి వెంకటరమణ పాల్గొన్నారు.



ముమ్మిడివరం: దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం అమలు

అల్లవరం: టీడీపీ కూటమి పాలనలోనే ప్రజా సంక్షేమాలు అమలు జరిగి లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం మండలం కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే ఆనందరావు శ్రీకారంచుట్టారు. కొమరగిరిపట్నంలో దివ్యాంగుల పింఛన్‌ను పెంచిన సందర్భంగా కేక్‌కట్ చేసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బోడసకుర్రులో రొక్కాల విజయలక్ష్మి, కార్యదర్శి ఎస్.దుర్గా శ్రీనివాస్ వీఆర్వోల ఆధ్వర్యంలో వరద ముంపులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహసీల్దారు సునీల్‌కుమార్, సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, వడ్డి సుభాషిణితో పాటు దాట్ల గోపిరాజు, గుర్రం ఏసుబాబు, ఎంపీటీసీ ఎం.శ్రీనివాస్, గుర్రంబాబులు, విజయ్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే పెన్షన్ల పెంపు

ఉప్పలగుప్తం: చంద్రబాబు పాలనలో మాత్రమే సామాజిక పెన్షన్ల సొమ్ము పెంపు జరిగిందన్న అంశాన్ని అందరూ గమనించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గురువారం భీమనపల్లిలో ఆయన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టీడీపీ నాయకులు మంచెం బుజ్జి, గుత్తుల నాగేశ్వరరావు, కంకటాల రాము, ఉప సర్పంచ్ కోలపల్లి గోపి, ఆకేటి బాబులు, యాళ్ల సత్తిబాబు పాల్గొన్నారు.

రాజోలు: పొదలాడలో లబ్ధిదారులకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం పెన్షన్లు పంపిణీ చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాజోలు ఎంపీపీ కేతా శ్రీను లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ తెలుగురైతు ఉపాధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్ కాండ్రేగుల సత్యనారాయణ, గుండుబోగుల పెద్దకాపు, సూరిశెట్టి శ్రీనివాస్, చాగంటి స్వామి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మానుకొండ దుర్గాప్రసాద్, కడలి నారాయణమూర్తి, వడ్డమూడి ప్రకాష్, పిప్పళ్ల రాంబాబు, వడ్డమూడి చిన్నీ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట: వాడపాలెంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు



మండపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



అల్లవరం: కొమరగిరిపట్నంలో పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



అయినవిల్లి: విలసలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

వృద్ధ దంపతులకు వసతి ఏర్పాటు

పిగన్నవరం, ఆగస్టు 1: వరద ముంపులో భాగంగా గోదావరి గ్రేంకల డ్రైన్ నుంచి పోటెత్తిన నీటితో దెబ్బతిన్న తాటాకిలుతో ఇబ్బందులు పడుతున్న వృద్ధ దంపతులు కొల్లు రాధాకృష్ణ, నాగమణి దంపతులకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తాత్కాలిక నివాసం ఏర్పాటు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన రోడ్డుపై వంట..గుడిలో నిద్ర వార్తకు అధికారులు స్పందించారు. సాయంత్రం సచివాలయంలో ఉండే విధంగా తాళాలు అందించారు. ఆ దంపతులకు ముందే చెప్పామని వారు సమీప ఆలయంలో ఉంటామని చెప్పినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. వరద ముంపు తగ్గిన తరువాత దెబ్బతిన్న ఇంటిని మరమ్మతులు చేసుకునేవరకు సచివాలయంలోనే ఉంటారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రి సుభాష్‌ను కలిసిన దేవదాయశాఖ అధికారి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 1:జిల్లా దేవదాయశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సుభాష్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆలయాల అభివృద్ధికి, భక్తులకు సేవలు పెంపొందించడానికి కృషి చేయాలని మంత్రి సుభాష్ సూచించారు. కార్యక్రమంలో అమలాపురం డివిజన్ దేవాదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ఈవో వీర్రాజు చౌదరి పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 1: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నదాన భవన నిర్మాణానికి ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన సరిదే భాను రూ.50 వేలు విరాళం సమర్పించారు. దాతకు ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,34,516 లభించినట్టు ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు.

బాలబాలాజీ నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మామిడికుదురు, ఆగస్టు 1: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన శిఖా శ్రీనివాసరావు-నాగమణి దంపతులు గురువారం రూ.20,116 విరాళంగా అందించారు. ప్రతీ సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున అన్నదానం జరిపించాలని ఈ విరాళం అందించినట్టు ఆలయ ఏసీ జి.మాధవి తెలిపారు. విరాళం అందించిన దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించారు.

దారి దోపిడీ చేసిన వారిపై కేసు నమోదు

కె.గంగవరం, ఆగస్టు1: మండలంలోని పాణింగపల్లి పరిసరాల్లో దారికాచి దోపిడీ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పామర్రు ఎస్.ఐ. కె.జానీబాషా చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రు గ్రామానికి చెందిన అరిశెట్టి మణికంఠ జూలై28న పామర్రు నుంచి పాణింగపల్లి మీదుగా ద్రాక్షారామం మోటారుసైకిల్‌పై వెళుతున్నాడు. పాణింగపల్లి మురుగుడ్రైన్ దాటిన తరువాత అతనిని మసకపల్లికి చెందిన రవ్వాభూషణం, ద్రాక్షారామానికి చెందిన నలాది శ్రీను మరో ముగ్గురు వ్యక్తులు దారి అడ్డగించారు. నువ్వు అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నావని కేసుపెట్టి జైలుకు పంపిస్తామని బెదిరించారు. తమకు రెండు లక్షలు ఇస్తే వదిలేస్తామని, లేకపోతే చంపేస్తామని బెదిరించారు. దీంతో మణికంఠ తన స్నేహితులతో మాట్లాడి రూ.25వేలు రవ్వా భూషణానికి ఇచ్చి ప్రాణాలు దక్కించుకున్నట్లు ఆరెళ్ల మణికంఠ ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కపిలేశ్వరపురం, ఆగస్టు 1 : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోని దొరలమ్మ తల్లి చెట్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా మద్యం తరలిస్తున్న రాజమండ్రి భాస్కర్ నగర్‌కు చెందిన పాతాల రవితేజ, కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సారిపల్లి మహేష్‌బాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.4,332 విలువచేసే 36 మద్యం సీసాలను, ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసునమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

విధులకు ఆటంకంపై ఇద్దరికి జరిమానా

కపిలేశ్వరపురం, ఆగస్టు 1: విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి రామచంద్రపురం కోర్టు జడ్జి గురువారం రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు అంగర ఎస్ఐ ఎ.పరదేశి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... 2018 జూలై 31న అంగర పీహెచ్‌సీలో నర్సుగా పనిచేస్తున్న పాలంగి విజయలక్ష్మిపై అదే పీహెచ్‌సీలో పనిచేస్తున్న వాచ్‌మెన్ గొట్టు వెంకన్న అతని భార్య కామేశ్వరిలు విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. గురువారం వీరిని కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాలు విన్న అనంతరం వీరిరువురికీ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కె.వెంకటేశ్వరరావు తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్, ఆగస్టు 1: ప్రేమ వ్యవహారంలో యువకునిపై దాడిచేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ గురువారం తెలిపారు. అమలాపురం మార్కెట్ ప్రాంతానికి చెందిన మానుపాటి నానిబాబుకు సమనస గ్రామానికి చెందిన యువతితో ప్రేమవ్యవహారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో యువతి బంధువులు గొలకోటి ధర్మారావు, శ్రీరామ్, కేశవ్ నానిబాబుపై దాడిచేసి గాయపరిచారు. నానిబాబు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గాయపడ్డ నానిబాబు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నానిబాబు దాడి ఘటనను నేషనల్ ట్రిబ్యునల్ ఫెడరేషన్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పు శ్రీనివాస్, కొప్పుల బాబి, ఎ.రాజు ఖండించారు.

దాడికి పాల్పడ్డ ఇరువురిపై కేసు నమోదు

అమలాపురం రూరల్, ఆగస్టు 1: నడిపూడి లాకుల వద్ద లూజు పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన యువకులు చిల్లర విషయంలో గొడవ తలెత్తడంతో పాన్‌షాపు యజమానిపై బాటిల్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గురువారం మధ్యాహ్నం జరిగిన సంఘటనలో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా దాడికి పాల్పడ్డవారు పరారవుతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో దాడికి పాల్పడ్డ గరగబోయిన పండు, షేక్ ఖాశింలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు.

3 నుంచి తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం, ఆగస్టు 1:వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా ఆండాళ్ తిరునక్షత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్ కుమార్ తెలిపారు.ఈనెల3నుంచి ఐదురోజులు నిర్వహిస్తారు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం'

అమలాపురం టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దళిత ఐక్యవేదిక, ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే వర్గీకరణ పేరుతో ఎస్సీలను విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై ఆరుగురు న్యాయమూర్తులు వర్గీకరణ అవసరమని అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఈదరపల్లిలో దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు ఆధ్వర్యంలో చైర్మన్ డీబీ లోక్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. దళితుల ఐక్యతకు అవసరమైతే మరో ఉద్యమం చేపడతామని కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పేర్కొన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు కోట రామ్మోహనరావు, గెడ్డం సురేష్‌బాబు, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, పొలమూరి మోహన్‌బాబు, బొంతు రమణ, గూటం సాయి, అరుణకుమార్, మాకే సిద్ధు, సరెళ్ల రామకృష్ణ, డేవిడ్ అంబేడ్కర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, ఆగస్టు 1: అమృత తుల్యమైన తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నవజాత శిశువులకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లీబిడ్డల శ్రేయస్సుకు తల్లిపాల వినియోగం ఎంత అవసరమో వివరించారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు శ్రేష్టమన్నారు. డబ్బాపాలు వద్దు తల్లిపాలు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అన్నారు. వియ్యూరివారి మెరకలో కె.రత్నకుమారి సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు, భారత న్యాయ సంహిత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, కటకం రత్నకుమారి, పడవల పద్మావతి, కె.జ్యోతి, నందిని, ఎస్తేరు, నాగమ్మ, కుమారిదుర్గ, శేషవేణి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: తల్లిపాలు పుట్టిన బిడ్డకు వెంటనే పట్టించాలని దీని ద్వారా ఆ బిడ్డకు రోగనిరోధకశక్తి పెరుగుతుందని వైద్యాధికారి శ్రీనివాస్, గౌతమిలు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పోస్టరును ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బి.అప్పారావు, పీహెచ్ఎన్ రత్నకుమారి, వైద్య సిబ్బంది ప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఆగస్టు 1: యానాం నియోజకవర్గంలోని మున్సిపల్ ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. స్థానిక ప్రజాపనులశాఖ కార్యాలయం సమీపంలో టెంట్‌వేసి ఆందోళన చేశారు. ముఖ్యంగా ఉద్యోగులకు రావాల్సిన జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ఉద్యోగులందరూ దీక్షా శిబిరంలో కూర్చుని వారి ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరికి పుదుచ్చేరి ఆర్ఎల్‌వీ జననాయగం పేరుపై రాష్ట్ర జనరల్ సెక్రటరీ అరదాడి పోసియ్య, కాంగ్రెస్ నాయకుడు మల్లాడి సత్తిబాబు తదితరులు తమ సంఘీభావం తెలిపారు.

ఆర్‌సీ చర్చిలో నూతన నిర్మాణాలు ప్రారంభం

యానాం, ఆగస్టు 1: యానాం నియోజవర్గంలోని ఫ్రెంచి పాలకుల 180ఏళ్ల నాటి చారిత్రక రోమన్ కేథలిక్ చర్చిలో పారంపర్యాము పేరుతో నూతన భవనంతోపాటు పలు నిర్మాణాలను ప్రారంభించారు. చర్చి పాదర్ పి.మరియదాస్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి ప్రముఖ విచారణ గురువులు పోలిమేర జయరావు, మల్లవరపు ప్రకాశ్, షైపాన్ పాల్‌లతోపాటు యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణా, వెంకటేశ్వర ఆలయ పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధి కాపగంటి ఉమాశంకర్‌తోపాటు పలువు హాజరయ్యారు.

పాడిపశువుల ఆరోగ్యపరిరక్షణకు పశువైద్య శిబిరాలు ఏర్పాటు

పి.గన్నవవరం, ఆగస్టు 1: వరద ముంపు ప్రాంతాలలో లంకగ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీమ్‌లు పశువుల ఆరోగ్య పరిస్థితిని ఏప్పటికప్పుడు పరివేక్షణ చేస్తున్నారని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ కర్నిడి మూర్తి తెలిపారు. లంకల గన్నవరంలో జరిగిన పశుదాణా పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి పాల్గొని అనంతరం మాట్లాడారు. ప్రతిపశువుకు 5కేజీలు చొప్పున ఐదు రోజులకుగాను 25 కేజీలదాణా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 90మెట్రిక్‌టన్నుల పశుదాణాను పాడిరైతులకు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టులో తీర్పుపై సంబరాలు



అంబాజీపేటలో, ముమ్మిడివరంలలో నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దండోర నాయకులు

ముమ్మిడివరం: ఆగస్టు 1: ముమ్మిడివరంలో ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పోలమ్మ చెరువుగట్టున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఖండవల్లి ఏలియా, నలమాటి లంకరాజు, ఆకుమర్తి సాయికృష్ణ, బొమ్మి హరికృష్ణ, లంక శ్రీనివాసరావు, రామారావు, పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పుతో ఎంఆర్పీఎస్ నాయకులు రామచంద్రపురం పట్టణం లో సంబరాలు జరుపుకున్నారు. మెయిన్‌రోడ్డులో అంబేడ్కర్ విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, పైడిమళ్ల అన్నవరం, ఉప్పలపాటి దేవానందం, మండపల్లి చిట్టిబాబు, న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, చిర్రా సురేష్, పలివెల రాజు,తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పుతో గ్రామాల్లో హర్షాతిరేకాలు వెల్లివిరిసాయి. బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలివెల శివరావు, పెందుర్తి యేసేబు, తదితరులు సంబరాలు జరుపుకున్నారు.

రాయవరం: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఏమార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఎమార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజ్, చుక్కా శేషు, దార్ల సతీష్, చంద్రమళ్ల రామకృష్ణ, ఎల్.చందు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

అంబాజీపేట: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమని దండోర నాయకులు అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులుర్పించారు. కార్యక్రమంలో ఈతకోట సత్యనారాయణ, నేదునూరి పెద్దిరాజు, దిగుమర్తి చిట్టిబాబు, ఉందుర్తి వెంకటేశ్వరరావు, నవుండ్రు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టులో గురువారం వెలువడిన తీర్పుపై పి.గన్నవరం మండల మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. త్రీరోడ్ సెంటర్‌లో నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పెదపూడి రాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాణసంచా కాల్చి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు తవిటికి బుజ్జి, చింతపర్తి వెంకటేశ్వరావు, కొండేటి నానిబాబు, ఈతకోట సత్యనారాయణ, తవిటికి శ్యామ్‌బాబు, చింతపర్తి సంజీవరావు, దిగుమర్తి సత్యనారాయణ, సిద్ధార్థ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నాలుగు మండలాల సీనియర్ దండోరా నాయకులు వీధి నాగభూషణం, సత్తాల ప్రసాద్, చెయ్యేటి శ్రీనుబాబు, వీధి లోవరాజు, వీధి చంద్రశేఖర్, బదుగు సాయి, సిద్ధిన పెదబాబు, చుట్టుగుళ్ళ అన్నవరం, సత్తాల సంపదరావు, పెదపూడి రుక్మిణి హర్షం వ్యక్తం చేశారు.

ఆత్రేయపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం తీర్పుపై ఎమ్మార్పీఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం విజయం సాధించడంపై మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. లొల్ల, మెర్లపాలెం గ్రామాల్లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు.కాయల జగన్నాథం, దండోర నాయకులు యార్లగడ్డ సత్తిబాబు, కొమ్మర వీరరాఘవులు, గంధం యాకోబు, క్రాప నాగరాజు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: బాలయోగి పార్కులో గురువారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల రాంబాబు, తొత్తరమూడి నరసింహమూర్తి, చాట్ల విద్యాసాగర్, వంగలపూడి నరసింహమూర్తి, సత్తాల వెంకట్రావు, పలివెల సుధీర్ పాల్గొన్నారు.

మామిడికుదురు: ఎస్సీవర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మామిడికుదురు సెంటర్‌లో కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఎమ్మెస్సీ జిల్లా అధికార ప్రతినిధి నూటుకుర్తి సత్యనారాయణ, చేట్ల సత్యనారాయణ, శెట్టెం రమేష్, ముసూడి నాగప్రభాకర్, ఆకుమర్తి భాస్కరరావు, తొత్తరమూడి శ్రీను, చుట్టుగుళ్ల కిశోర్, ముసూడి నరసింహస్వామి పాల్గొన్నారు.

రాజోలు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిశోర్ హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణకు మద్దతునిచ్చిన ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలకు తెలుగు రాష్ట్రాల మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పటి రాజేష్, నామనవరపు సత్యనారాయణ, శ్యామ్‌బాబు, ముస్కూడి సత్యనారాయణ, సిర్రా మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు విజయభాస్కర వర్మ ఆకస్మిక మృతి

● పలువురు సంతాపం

ముమ్మిడివరం, ఆగస్టు 1: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయభాస్కరవర్మ (64) బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆకస్మికంగా మృతిచెందారు. విజయభాస్కరవర్మ అస్వస్థతతకు గురవడంతో కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందారు. ఈయనకు భార్య ఛాయదేవి, ముగ్గురు కుమార్తెలు దీపిక, దివ్య, నవ్య ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం 1982 నుంచి విజయభాస్కరవర్మ క్రియాశీలపాత్ర పోషిస్తూ వచ్చారు. 1988-1995 వరకు, 2001-06 వరకు చినకొత్తలంక గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 1996-2000 మధ్య కొత్తలంక పీఏసీఎస్ అధ్యక్షునిగా పనిచేశారు. టీడీపీలో మండల, జిల్లాస్థాయి పదవులు నిర్వహించారు.

పలువురు పరామర్శ

విజయభాస్కరవర్మ భౌతికకాయాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందలతో పాటు టీడీపీ నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. విజయభాస్కరవర్మ ఆకస్మిక మృతికి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గుద్దటి జమ్మి, దాట్ల బాబు, పొద్దోకునారాయణరావు,చిక్కాల అంజిబాబు, నడిమింటి సూర్యప్రభాకరం, బొక్కా రుక్మిణి, నడింపల్లి శ్రీనివాసరాజు, కాశి లాజర్, సర్పంచ్ పొత్తూరి ఉమారాణి, ఎంపీటీసీ పొత్తూరి వీణారాణి, అర్థాని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పొత్తూరి విజయభాస్కరవర్మ అకాలమృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం జరిగిన సంతాప సభలో పొత్తూరి విజయభాస్కరవర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.



పొత్తూరి విజయభాస్కరవర్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే వివేకానంద